ఇలువేలుపు శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో

శ్రీ గురుస్తుతి శతకం

వాట్సాప్ వాఙ్మయం 108










రాంభట్ల వేంకటరాయశర్మ

అంకితం



జననం : 24-11-1900	జననం : 15-12-1910
నిర్యాణం : 16-09-1981	నిర్యాణం : 28-12-1995

కీ॥శే॥డా॥రాంభట్ల వేంకటరావు, కీ॥శే॥ రాంభట్ల సూర్య కాంతమ్మ

ఇలువేలుపు

శ్రీశ్రీశ్రీ వెంకమ్మ పేరంటాలు ఆశీస్సులతో...

శ్రీ గురుస్తుతి శతకం

(వాట్సాప్ వాఙ్మయం)



రాంభట్ల వేంకటరాయశర్మ

డా. రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్

విశాఖపట్నం

2016

Sri Gurustuti Satakam
(Extempore Whats App Poetry)

by
R. V. R. SHARMA

శ్రీ గురుస్తుతి శతకం
(వాట్సాప్ వాఙ్మయం)
రాంభట్ల వేంకటరాయ శర్మ

I Edition : **2016**
ప్రథమముద్రణ : దుర్ముఖి నామసంవత్సరం

Copies : **500**

Rs. : **50/-**

Pages : **36d**

Published by :
DR. RAMBHATLA VENKATARAO MEMORIAL TRUST
CHINAMUSHIDIWADA, VISAKHAPATNAM.
Cell : 9393122394, 9985243171.

Printed at :
SATHYAM OFFSET IMPRINTS,
MADHURA NAGAR, VISAKHAPATNAM,
Cell : 9849996538

'అద్వైతసిద్ధిరత్నాకర', 'తర్కవేదాంతవిద్వాన్'
ఎమ్. దత్తాత్రేయశాస్త్రి
భాషాప్రవీణ, సాహిత్య, న్యాయ విద్యాప్రవీణ
ఎమ్.ఏ. (తెలుగు)., ఎమ్.ఏ. (సంస్కృతం)., పిహెచ్.డి.
ప్రొఫెసర్, తెలుగుడిపార్ట్‌మెంట్, ఆంధ్రాయూనివర్సిటీ, విశాఖపట్నం - 03

శ్రీ శివాయ గురవేనమః

"కావ్యంతుజాయతేజాతు కస్యచిత్ ప్రతిభావతః". కావ్యం ఒకానొక ప్రతిభావంతుని వల్ల నిర్మితమౌతుందని భావం. ఆలంకారికోక్తి. ప్రతిభ సహజ, గురుదేవతానుగ్రహ ప్రసాదలబ్ద అనే రెండు రకాలు. ప్రస్తుతం శ్రీ గురుస్తుతి శతకమును రచించిన చి. వేంకటరాయశర్మ ప్రతిభ సహజము మరియు తమ తాతగారి అనుగ్రహజన్యము అయినది. కాబట్టి ఈతని కవిత్వంలో వినయం ప్రతిపద్యంలో కనిపిస్తుంది. కారణం ఈతని ఈ లఘు కావ్యంలోని మకుటమే. "వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్". "శతకము" అంటే శతము చేత "క" సుఖమును కల్గించేది అని ఒక అర్థం. నూరు పద్యములచే గురువును స్తుతించి ఎంతో ఒకకొంత సంతృప్తిని గురుభక్తిని వ్యక్తంచేసి, నేటి సాహిత్యాభిమానులకు యువజనులకు ఆదర్శంగా నిలుస్తాడనుటలో సందేహంలేదు. గురువులు 'దీక్షాగురువులు', 'శిక్షా గురువులు' అని రెండు విధాలుగా ఉంటారు. మంత్ర దీక్షనిచ్చే గురువు దీక్షా గురువు ఒక్కడే ఉండాలి. శిక్షాగురువులు అనేకులు ఉండవచ్చు. ఈ విషయం శ్రీమద్భాగవతం ఏకాదశస్కంధంలో 'యదు-అవదూత' సంవాదంలో స్పష్టముగా

ఉంది. చి. శర్మ శతకంలో గురువులు అందరూ శిక్షా గురువులే. ఒక్కొక్క కథను తీసుకొని ఆ ఉపాఖ్యానమును ఒక పద్యములో చెప్పి అతను నమ్మిన గురువు జగద్గురువై ఉండుటచే ఆ గురుపదములకు నమస్కరించాడు.

కావ్యంలో కవి ప్రత్యక్షమౌతాడు. అతని జీవలక్షణం ఎంత ఆచ్ఛాదన చేద్దామని ప్రయత్నించినా కుదరదు. చి. శర్మ జ్యోతిషమును అధ్యయనం చేయుటయే కాక దానిమీద ఆసక్తి ఎక్కువ. అందుచేత గ్రహదేవతలకు సంబంధించిన స్తోత్రమును ఇందులో పొందుపరిచాడు. సంప్రదాయ ప్రధాన లక్షణాలుగల అభిజన్యుడై ఉండటంచే ఆ భావాలు వ్యక్తమౌతుంటాయి.

హృదయం– బుద్ధి– వాక్కు మూడు భక్తియుక్తమై ఉండుటచే ముచ్చటగా ఉందీ కవిత్వం. విషయం. తమ తల్లిమీద అపారగౌరవం గల చి. శర్మకు జగదంబ అసీమకృపను అనుగ్రహించుగాక.

ఆశీస్సులతో

శ్రీమాతృపాదరేణువు

యం. దత్తాత్రేయశాస్త్రి

'వందన శతముల్'

ఈ మధ్య తరచుగా 'వాట్సాప్', 'ఫేస్‌బుక్'ల వల్ల పిల్లల చదువులు పాడైపోతున్నాయి అంటూ ఎప్పుడో అప్పుడు, ఎవరినోటో ఒకరినోట వినిపిస్తున్న మాట. ఏ సాధనమైనా వాడుకునే మనిషిని బట్టీ, వాడుకునే పద్ధతి బట్టీ దాని ఉపయోగం ఉంటుందనే పెద్దల నుడి, మొన్న జూన్ 9న నాకు అర్థమైంది. ఎవరెవరి అభిరుచికి తగినట్లు, వారు పై సాధనాలను వాడుకుంటారని అందరికి తెలిసిందే. అలాగే 'డా. రాంభట్ల వేంకటరావు మెమోరియల్ ట్రస్ట్' పేరున ఉన్న ఒక 'వాట్సాప్ గ్రూపు'లో నేనొక పద్యం రాసి పెడితే దానికి స్పందనగా మా 'సుందు' బాబాయి, అందమైన కందపద్య పాదాన్ని నాకు అందించి, "నాన్నా సుధీ!" ఈ మకుటంతో శతకం రాసి , గురు పూర్ణిమకు పూర్తి చేస్తే బాగుంటుంది" అని అన్నారు. ఆ గ్రూప్ లోని మా బంధుగణ ప్రోత్సాహంతో గణబంధురమైన పద్యాలను ప్రారంభించాను.

ఆ రోజు జ్యేష్ఠ శుద్ధపంచమి, గురువారం. గురుపూర్ణిమకు అప్పటికి నెలన్నర వ్యవధి ఉంది. ఇచ్చిన పద్యపాదం "వరమౌ గురుపదముకెపుడు వందన శతముల్". మా రాంభట్ల వారి ఇలువేల్పు వెంకమ్మ పేరంటాలు, మా ఇష్టదైవం శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్యాశిస్సులతో... మా నాన్న, మా తాతగారి దీవెనలతో, ఇంట్లో మా అమ్మ ప్రోత్సాహంతో, గ్రూప్‌లో ఉన్న 'రాంభట్ల' కుటుంబసభ్యుల వాట్సాప్ ప్రోత్సాహంతో ప్రారంభించిన ఈ శతకం జూన్ 12 నాటికి 108 పద్యాలతో పూర్తయ్యింది. ఇదంతా మా పద్యవిద్యకు గురువైన మా తాతగారు కీ.శే. రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారి ఆశీర్వచనం.

6వ తరగతి చదువుతున్నప్పటి నుండి మాకు పద్యాలంటే ఇష్టం కలిగించి, స్వయంగా తను రాసిన పద్యాలను వినిపించి, సాహిత్య సభలకు తీసుకువెళ్ళి, నన్ను, మాతమ్ముడు "శతావధాని" చి. రాంభట్ల పార్వతీశ్వరశర్మను తెలుగు సాహిత్యం పూదోటలో వేలుపట్టుకు నడిపించిన కీర్తి మా తాతగారిదే. అందుకు సానుకూలంగా మమ్మల్ని పెంచిన మా అమ్మానాన్నలు, సూర్య కాంత కామేశ్వరి, లక్ష్మీ నరసింహ సోమయాజులది కూడా. తమ్ముడి సాధన గురించి నాకు తోచిన సమస్యల్ని దత్తపదుల్ని ఇచ్చే నన్ను, ఒక శతకం రాయమని ప్రోత్సహించి, పూర్తయ్యాక పుస్తకముద్రణకు కొంత సహాయమందించిన చిన్నాన్న రాంభట్ల నృసింహశర్మ గారికి (సుందు బాబాయి), ఈ శతకంలోని పద్యాలను విని ఆనందించి, ముద్రణకు విత్తాన్ని అందించిన తాతగారు శ్రీ రాంభట్ల బాలకృష్ణశర్మ గారికి (కిష్టప్ప తాతగారు) ప్రత్యేకకృతజ్ఞతలు. మా ముత్తాతగారు కీ. శే. డా. రాంభట్ల వేంకటరావు (కుప్పిలి తాతగారు) తరపు రాంభట్ల కుటుంబసభ్యులందరికీ కృతజ్ఞతలు. ఈ పుస్తకముద్రణాభారాన్ని కొంత వహించిన ఆప్తులు వడ్లమాని ఉషానాగమణి, బిలాయ్ గారికి కృతజ్ఞతలు.

సాహిత్యంలో మమ్మల్ని ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్న 'ఆచార్య సార్వభౌమ' వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి, శిష్య వాత్సల్యంతో ఆశీస్సులు అందించిన గురువుగారు, నా పరిశోధనకు పర్యవేక్షకులు 'అద్వైతసిద్ధిరత్నాకర' ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయశాస్త్రి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

రాంభట్ల వేంకటరాయశర్మ

శ్రీ గురుస్తుతి శతకం

1. నిరతము కొలిచెద వాణిని
గురుతర భావమ్ము పొందగోరుచు భక్తిన్
ధరనొక శతకము వ్రాయుటె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

2. హరభామిని కనుగుం సుతు
డరయును విఘ్నములు కలుగ కాద్యంతము నా
కరివదనుని, గుణవరదుని
వరమౌ గురుపదముకెపుడు వందనశతముల్

3. శరణము వేడుదు నిత్యము
దరహాసపు మోముతోడ ధైర్యము నిడు నా
వరదుని వేంకటనాథుని
వరమౌ గురుపదముకెపుడు వందన శతముల్

4. అరిషడ్వర్గము నహమును
నిరతము దూరమ్ము చేసి నిన్నే తలుతున్
సరసిజనాభా! నీదౌ
వరమౌ గురుపదముకెపుడు వందన శతముల్

5. స్వరమై నిల్చిన లక్ష్మీ
నరసింహా! సోమయాజి! నతిఁగొని తండ్రీ!
తిరముగ దీవింపుము! నీ
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

6. 'అరుణాధ్వ' 'సంప్రదాయము'
లొరర నొకట నిమిడ్చు యోధు, డొజ్జగు కవితా
వర పార్వతీశ్వరాఖ్యుని
వరమౌ గురుపదముకెపుడు వందన శతముల్

7. గురు పంచమి తిథి యందున్
సరసజ్ఞత యొప్ప నొక్క శతకము వ్రాయన్
త్వరపడుచున్నది యుల్లము
వరమౌ గురుపదముకెపుడు వందనశతముల్

8. గురుబలమిదె బాగున్నది
త్వరలో పొత్తంపు రూపు దాల్చుట స్థిరమౌ;
పరమేష్ఠి కొలుతు నాతని
వరమౌ గురుపదముకెపుడు వందన శతముల్

9. కరమే జాతకచక్రము
స్వరమే శాస్త్రమ్ము తెలుపు సాధన మవగా
నరులకు జీవంబౌ ధీ
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

10. భరతుండేలిన సీమయె
వరభారతదేశమనగ వర్ధిలుచుండెన్
స్థిరమౌ శాంతికి నెలవిదె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

11. హరుడే పుట్టెను భువి శం
కర భగవత్పాదులుగను,కర్మాద్వైతో
ద్ధరణమొనర్చిన యాతని
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

12. 'స్వరములు' పదిపై నారగు
వరుసగ ముప్పదియు నేడు 'వ్యంజనముల'గున్
మరి 'త్ర్యుభయాక్షర' మాలిక
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

13. అరయగ 'నన్నయ' 'తిక్కన'
విరచించిన పద్య భావవీచికలొప్పన్
పరచిన 'యెఱ్రని' విరియే
వరమౌ! గురు పదముకెపుడు వందనశతముల్

14. నిరతంబీశ్వర సేవయు
సరసపు సాహిత్య రచన, 'చాటూక్తులతో'
వరలె, కవి శ్రీనాథుని
వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్

15. పర భావము లేకుండగ
తరచౌ నవవిధపుభక్తి తత్త్వము పంచెన్
పరుఁ జేరగ 'పోతన' కవి
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

16. నిరుపమగుణధామునిగాఁ
బరగిన 'ప్రవరాఖ్యు చరిత' బాగుగ వ్రాసెన్
నరనుత 'పెద్దన' యల్లిక
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

17. వెఱపును చూపని రాయల,
స్థిరమగు జ్ఞానమ్ము 'విష్ణుచిత్తీయము'గా
వరలెను సత్కావ్యంబై
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

18. 'గిరికన్యా వసురాజు'ల
పరిణయమును శ్లేష, యమక వర్ణనములతో
సరిగా నడిపిన 'భూషణు'
వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్

19. పరిణితి చెందిన కావ్యము
నరకాసుర వధ కథకును నాందియు నిదియే
'అరణపు కవి'యౌ తిమ్మన
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

20. నరజన్మంబునకిలలో
పరితోషము కలుగఁజేయు పావన జపమున్
సిరిగల వేంకటరమణుని
వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్

21. 'కరి రాజు'ను కాపాడగ
దరి చేరిన వారికిల 'సుదర్శన'మవగా
సిరివిడి వడివడి వచ్చుట
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

దశావతారస్తోత్రం:

22. వరవేదోద్ధరణమునకు
జొరగొని తా నీట మునిగి, 'సోమకు' ద్రుంచెన్
నిరుపమ 'మత్స్యాకృతి'తో
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

23. పరివారము కదలిఁ జిలుక
'గిరిరాజము' క్రుంగిపోవ; 'గిరిధరు'డై శ్రీ
హరి 'కూర్మాకృతి' దాల్చెను
వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్

24. ధరణిని రక్షింపగ సిత
'వరాహ' రూపమున నసురవైరిని ద్రుంచెన్
పరిశాత'దంష్ట్ర'యుగళిని
వరమౌ! గురు పదముకెపుడు వందనశతముల్

25. అరికుల సంజాతునకై
'నరహరి' యా 'కనకకశిపు' నయమునఁ జంపెన్
చిరుతడు 'ప్రహ్లాదుని'దౌ
వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్

26. కరమనురక్తిని కోరిన
వర మొసగెద ననెడిదాత "బలి"యైపోయెన్
వర 'వామన' రూపుడ నీ
వరమౌ 'గురుపదము' కెపుడు వందనశతముల్

27. పరశువు చేతంబూనుచు
నిరువదియునునొక్కమారు హేలన్ నృపులన్
పరిమార్చిన భార్గవ నీ
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

28. వరగర్వితు "దశ కంఠు"ని,
శరధిని వారధినిఁ గట్టి, చక్కగ దునిమెన్
నిరతము నా శ్రీ రాముని
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

29. పరిజన సంతృప్తికి ద్వా
పరయుగమునఁ పుట్టె కృష్ణపరమాత్మునిగా!
నరసఖుడు జగద్గురువై
వరమౌ! గురు పదముకెపుడు వందనశతముల్

30. పురజన రక్షణ కొరకై
హరికిన్ పెద్దగను పుట్టి హలమును బట్టెన్
పరికింపగ 'బలరాముడె'
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

31. నరులకహింసయె 'బుద్ధుడు'
పరమపదమునొసగుననుచు భాషింపగ నా
పరమాత్ముని సందేశము
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

32. దురితపు కలికాలాంతము
కరవాలముఁ దాల్చి వచ్చు కలి ధర్మంబున్
ధరనిల్పగ నశ్వముపై
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

33. సురలకు నమృతము పంచగ
మురిపెముతో విష్ణుమాయ 'మోహిని'యై యా
సురనాయకు రక్షించెను
వరమౌ ! గురు పదముకెపుడు వందన శతముల్

జ్యోతిషం - నవగ్రహస్తోత్రం:

34. అరయగ నెంతటి చిత్రమొ
ధరనొక జీవమ్ము రూపు దాల్చుట యనగా
పరికింపగ గ్రహ"యోగమె"
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

35. స్థిరకక్ష్యను తిరుగాడుట
పరిపూర్ణ గురుత్వతత్త్వ భావముకాగన్
మరి గ్రహమిచ్చెడు ఫలితమె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

36. పరగను ద్వాదశరాశులు,
నిరువదియేడైన తార లీశ్వరకృపగా
వరలెడు 'జ్యోతిశ్శాస్త్రమె'
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

37. అరుణోదయ రవిబింబపు
కిరణములవి సోకినంత కీడిక తొలగున్
తరుణము గల 'గ్రహరాజే'
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

38. వరలక్ష్మికి ననుజుండవు
సురలోకపు మామవీవు సుందర 'చంద్రా'!
నరులకు 'సుధ'నిత్తువు నీ
వరమౌ గురుపదముకెపుడు వందన శతముల్

39. అరువది నాలుగు కళలకు
సురుచిర భావమ్మునందు, శుక్రుడె పతియౌ
పరిచిత'భృగువంశజుడే'
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

40. పరమాద్భుత రమణీయము,
గురుగ్రహము భక్తజనుల కోరిక తీర్చున్
సిరులిచ్చు దేవ'గురుడే'
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

41. జరిగెను తారాచంద్రము,
ఝురిమన్ వర్తించువాడు 'సౌమ్యుడు' పుట్టెన్
తరిగొను గ్రహమది 'బుధుడే'
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

42. ధరణీగర్భోద్భవుడన
గురుతుర రూపమ్ముదాల్చి 'కుజుడే' - గ్రహమై
వరలెడు 'భౌమ్యుని' చరితయె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

43. నిరతము నీలాంజన భా
సురతేజా! మిత్రపుత్ర! సోదరనరకే
శ్వర! ఛాయాత్మజ! 'శని' నీ
వరమౌ గురుపదముకెపుడు వందనశతముల్

44. హరిచక్ర ధాటికరగొని
విరిగెను మొండెమ్ము తలయు విన్యస్తంబై
ధరపడని రాహు కేతుల
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

(నవగ్రహస్తుతి సంపూర్ణం)

45. గురు, రాహువు కలయిక నే
గురు చండాలమను పేర గుర్తించెన్ గా!
నిరతము గ్రహ "యోగము" లే
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

46. గరళము మ్రింగిన హరునకు
'స్వర' తాపము దూరమవగ చల్లని గిరిపై,
గిరిరాజకన్యనిచ్చుటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

47. పరుషము లేమియు పలుకక
సరళపు పదములు పలికెద, స్వామీ నీకై
తిరుమల వేంకట పతిదౌ
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

48. పరులకు హానిని సలుపని
సరళంబౌ పనులు చేయు సంస్కారముతో,
పరిణితిచెందిన 'మతి'యే
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

49. కరణము, యోగము, తిథియును
వరుసగ వారమ్ము, తార - 'పంచాంగము'గా
వరలును, మానవ జాతికి
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

50. అరవిందాసన సుందరి
యురసిజములయి వెలుగొందు నుత్కృష్టముగా
'స్వరమయ' సాహిత్యమ్ములు
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

51. ఇరకటములు బాపుcగొనగ
పరకామణి చేరినంత పాపము పోవున్
తిరుమల సురరాట్ రూపమె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

52. సురలకు నమృతము ప్రీతగు,
నరులకు నీ నామ మహిమ నారాయణుడా,
మరి ఋషులకు నీ చూపే
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

53. శిరమున 'గంగ'ను దాల్చియు
శరీరమున సగమునిచ్చి శాంభవికి శివా!
'శరభువు'నకు తండ్రివగుట
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

ఋతువర్ణన:

54. తరువుల చిగురింతలు మరి
విరిబాణుని పులకరింత, విభ్రమమనగా
ధరకున్ వసంత ఋతువే
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

55. ఖర కిరణతాపముపకున్
విరుగును రోళ్ళైన, ప్రాత వింజామరగా,
ధరకున్ గ్రీష్మపు ఋతువే
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

56. త్వరపడు తొలకరి వానకు
'వరి, గోధుమ, మొక్కజొన్న' వర్ధిలుచుండున్
ధరణికి నా వర్షర్తువు
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

57. విరహము పెంచెడి వెన్నెల,
చరణము వేడంగ వచ్చు శారద రాత్రుల్
ధరకున్ శరదృతు కాలమె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

58. చిరు చలి మాత్రముచేతనె
సరితూగెడు కాలమందు, సారము తెలియున్
ధరకున్ హేమంత ఋతువు
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

59. జరజర యాకుల రాల్చు, శి
శిరపు మహిమమనగ జీవి జీర్ణంబవగా,
త్వరలో కొత్తవి పుట్టుటె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

(ఋతువర్ణన సంపూర్ణం)

60. సురగణ సేనల నడుపుచు
ధరాధరము క్రౌంచమునిదె తాఁ గూల్చిన యా
'శరవణు' మనమున తలచుటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

61. పరులకు చేసిన దానము
నరులకు పుణ్యమ్మొసంగి 'నాకము' చేర్చున్
తెరవును చూపిన సూత్రమె
వరమౌ, గురు పదముకెపుడు వందన శతముల్

గంగావతరణం:

62. స్థిరముగ భగీరథుడు భువి
తరియింపగ పితరులాత్మ,! తపమును చేసెన్
సురనదికై ప్రార్థించుటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

63. సురనది పలికిన తీరిది -
"నరవర! వీడుమ తపమును, ననుఁ దాల్చెడి యా
పురుషుండెవడని?" యడుగుటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

64. హరునకు, శశిధరునకు, నా
పరమ శివునికై తపమును బాగుగ చేసెన్,
పురహరుడిచ్చిన మాటయె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

65. “తరమా! నను భరియించుట,
గిరిశయనుండోర్వఁ గలిగి కించిత్తనగా”?
‘సురలీ’ విధమున పల్కుట
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

66. తరుణీలలామ విను, నిను
భరియించెడి వాడు శివుడు, భర్గుడు తల్లీ!
కరుణన్ రమ్మని కోరుట
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

67. కరమున మృగమ్ము బెదరగ
కరి చర్మాంబరము కదల, కాయము పెంచెన్
ఝరి, జటల కటాహస్థము
వరమౌ ,గురు పదముకెపుడు వందన శతముల్

68. విరజా నది నుపమింపగ
సరళీ స్వరమనగ నిండె శంకరు తలపై!
హర గంగా సంగమ మదె
వరమౌ ,గురు పదముకెపుడు వందన శతముల్

69. హరి పదమున హర శిరమున
గిరి నొరయుచు సుడి తిరిగి భగీరథు వెంటన్
పరువెత్తె జహ్ను కన్యక
వరమౌ గురు పదముకెపుడు వందనశతముల్
(గంగావతరణ సంపూర్ణం)

70. పరధనమాశించుటయున్
బరమాత్మయు లేదనుటయు పాపము కదరా
సరసిజనాభుని కొలుచుటె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

71. ఇరులను దూరము చేసెడి
కరుణామయ సూర్య నిన్ను కానని జనులున్
పరలోకములను వెతుకుట
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

72. మురళీ గానము వినబడ
త్వరితగతిని పరువులెత్తు,తన్మయమొందున్
పరచిన గోపిక భక్తియె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

73. హరికిన్ పట్టపు రాణివి,
నిరుపేదల కల్ప వల్లి నీవే లక్ష్మీ!
సిరిగల దేవతవౌటయె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

74. దొరికీ దొరకని మోక్షము
దొరబుచ్చుకు నిచ్చువాడ తోయజ నేత్రా!
నరులకు నీ నామంబే
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

75. పరివృత మాయత్తముతో
దరి చేరిన వారిపట్ల దయనీయునిగా
నిరువుగదర్శనమిచ్చుటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

76. స్మరణము, గానము, కీర్తన,
సరితూగెడు భక్తజనపు సన్మానముగా
నిరతము భావించుటయే
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

77. నరబంధము కల్పించుట
గురుతుగ నున్నంతను మరి కూల్చెద వయ్యా
పరమాత్మా నీ యాటలె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

78. పరజన్మపు వాసనతో
మరచెదరు నిను, మహిమలు మాయలవేలా?
గురుతును తెప్పించుటయే
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

పంచభూతాలు:

79. ధరణీ ధారుణి పృథ్వీ
ధర కుః క్ష్మా క్షోణి భూమి ధాత్రీ విశ్వం
భర వసుధా సర్వంసహ
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

80. వరుణ కరుణ ధర గురియగ
'సరిదాశయ సాగరములు' సంవృద్ధింగనున్
చిరు చినుకుల పులకింతయె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

81. హర 'తార్తీయీకము'నన్
కరములతో కరము జగతి కాచెడి 'రవి'లోన్
నరముఖ్య 'జఠరమున' - "శుచి"
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

82. వరలు 'నుదాన' 'వ్యానం'
బరలేక 'సమాన'మనగ 'ప్రాణాపాన'
స్థిర సంచార 'సమీరమె'
వరమౌ! గురుపదముకెపుడు వందనశతముల్

83. ఖరునకు, హిమకరున కుపరి
నురుసంఖ్యన్ మెరయునట్టి యుడుగణమునకున్
పరివర్తస్థానము "ఖం"
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్
(పంచభూతాలు సంపూర్ణం)

84. తురగములై కోరికలే
పరిపరి విధముల చెలగిన పాపపు వేళన్
జరిపిన నీ నామ జపమె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

85. తరతమ బేధము లేకయె
యురమును విరిచియు నిలబడి, ఓర్పునుఁ గనకన్
త్వరపడు - దనుజుల దునుముటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

86. పరగను రాముని సేవను
పరహితమును కోరువారి భద్రము కొరకై
పరితాపమునొందుటయే
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

87. అరిజూచును హరిజూచును
బరిలో తానిలను సత్య - భామామణియై!
'నరకాసురవధ' ఘట్టమె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

88. విరిసి 'నది' 'నాసికా' స్థలి
మురిసె మహారాష్ట్ర మాంధ్రమున కన 'గోదా
వరి'యై దక్షిణ గంగయి
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

89. బిరబిర పరువిడు కృష్ణా
తరంగిణీ విలసనమున ధన్యాత్ముల మై
తరియింతము దుర్గను గని
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

90. ధరలో వైకుంఠముగా
తిరుమల గిరులై నిలిచెను, దీప్తుల పంచన్
సిరిపతి యే వేంకట పతి
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

91. తరియింపజీవవార్థిని,
వరనరులందరు వసించు వారాణసిలోన్
మరణించుటె కాశీ పురి
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

92. 'హరగిరి' పదమున మానస
సరోవరపు హంసికలదె సౌందర్యంబౌ!
స్ఫుర దేత న్నిభ కీర్తియె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

93. పరమేశ్వరుడే కుప్పిలి
పురమున పుర జనులగావ పొందిక కుప్పే
శ్వరుడై, స్వాయంభువుడై
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

94. ధర వేంకట రావును, సా
గర తీరంబులను చూచు గ్రామంబనగా,
సరియౌ కుప్పిలి నామమె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

95. హరితస గోత్రమునందున
వర రాంభట్లాన్వయమున, వైద్యుండనగా
మరి వేంకట రావనగను
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

96. గరుడపు రేఖను చేతిని,
అరుదగు వైద్యపు విశేషమభ్యాసముతో,
తరగని, గని వేంకటరాట్
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

97. తిరముగ రుచిగల వంటను,
కరమున తాచేయు సూర్య కాంతమ్మనగా
తరముల, కందించుటయే
వరమౌగురు పదముకెపుడు వందన శతముల్

98. ధరణిని రాంభట్ల గృహము
న రాజిలెడి వెంకమాంబ, నాకున్ దైవం
బరయగ నిలువేలుపునౌ
వరమౌ! గురుపదముకెపుడు వందనశతముల్

99. తరమున నురుతర గురుసమ
వర 'వేంకటసోయయాజి' వాసింగాంచెన్
విరిసిన 'ఆర్షజ్ఞానమె'
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

100. కరుణార్ద్ర హృదయ, యాపై
సరిలేని, చదువుల తల్లి, సత్యవతమ్మా!
ధరపై నీయాశయమే
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

101. తరమున కొకరనుచు, నిరం
తరమును ప్రోత్సాహమిచ్చె తాతయ, నిదియున్
వర పార్వతీశ్వరు కృపయ!
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

102. వర వెంకమాంబ యత్తగ,
స్థిరమౌ మాయింట బుట్టి, చేరెను,స్వామిన్
చెరగని ముద్రను వేయుటె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్.

103. సిరియై, రాంభట్లపు వని
తా రత్న మయి,తనవారి స్థావరమై, తా
నెరియౌ వేంకట రత్నమె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

104. వరుసగ వృశ్చిక రాశిని
ధరణీ పుత్రుడు, శనియును, తా కలయుటయే
మరియొక యోగము, చూడగ
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

105. గురుపూర్ణిమకొాక శతకము,
సరదాగా వ్రాయుమనుచు చక్కగ చెప్పన్
స్వరమతి 'చిన్నాన్న'నగా
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

106. స్వరమే సర్వము, సర్వము
స్వరమై వినిపించు నీవు, శారద కృపతో
వరలెడు 'నృసింహ శర్మ'యె
వరమౌ గురు పదముకెపుడు వందన శతముల్

107. హరిహర భేదము లేదని
పరిపరి విధముల తెలిపెను పండితచయమే!
'హరిహరతత్త్వమె' మనకును
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

108. 'హరి ఓం వేంకటపతి' యని
స్మరియించిన చాలు జన్మ సార్థకముకదా!
దురితములను పోగొట్టుటె
వరమౌ! గురు పదముకెపుడు వందన శతముల్

శ్రీ గురుస్తుతి శతకం సంపూర్ణం

మంగళమ్ మహత్

'గురు'స్తుతి

ఆధునిక తెలుగు సాహిత్యంలో శతకప్రక్రియ - కవులకు కొంగుబంగారమై విస్తృతమైన భావావిష్కరణకు వేదికగా నిలుస్తోంది. కవుల అభిరుచులకు అనుగుణంగా వివిధాంశాల క్రోడీకరణతో ఎన్నో శతకాలు వెలుగు చూస్తుంటాయి. భక్తిశతకాలు, నీతి శతకాలు, హాస్యశతకాలు, వ్యాజస్తుతిశతకాలు... ఇలా ఒక్కో కవిదీ ఒక్కో మార్గం. నేటి కాలంలో భక్తి, అధిక్షేపశతకాలే ఎక్కువగా ఊపిరి పోసుకొంటున్నాయి. అక్కడక్కడా నీతిశతకాలు కూడా కనిపిస్తున్నాయి.

ఈ 'శ్రీగురుస్తుతి శతకం' విషయవైవిధ్యంతో సాగిన సంకీర్ణ రచన. ఈ శతకంలో సంప్రదాయకవిత్వశైలితో సాధ్యమైనంతవరకు వాడుక భాషలోనే అన్నయ్య వేంకటరాయశర్మ పద్యరచన చేశాడు. ఇది స్తుతిప్రధానమైన కవిత్వం. 'వరమౌ - గురు - పదముకెపుడు - వందన - శతముల్' అన్నది మకుటం. శతసంఖ్యా సూచకం 'శతముల్' అన్న పదం. స్తుత్యర్థం - 'వందన'పదం. పాదం, పదం,

పాట, ఉత్తమ మార్గం మొదలైన విశేషార్థాల్ని సూచించే మాట – 'పదం'. శిక్షకుడు, బృహస్పతి, ఉత్కృష్టమైనది మొదలైన అర్థాల్ని ప్రతిపాదించేదిగా సందర్భానుసారంగా 'గురు' శబ్దాన్ని అన్నయ్య ఈ శతకంలో ప్రస్తావించాడు.


శతకంలో 'వస్త్వైక్యం' ఉండదు. 'ముక్తకాలు'గా పిలుచుకొనే శతకపద్యాల్లో ఏ పద్యభావం ఆ పద్యంతోనే ముగుస్తుంది. ఇందులోని నూట ఎనిమిది పద్యాల్లో విషయవైవిధ్యం, పునరుక్తులు లేకపోవడం స్పష్టమైన ప్రణాళికను మనముందుంచుతున్నాయి.

ఈ శతకంలో ఇష్టదేవతాస్తవం, గురువైన తాతగారు పార్వతీశ్వరశర్మగారి స్తుతి, మానాన్నగారు లక్ష్మీనరసింహసోమయాజులగారి స్మరణ, ఇంకా ప్రబంధ, కావ్యేతివృత్తాల ప్రస్తావన మొదలైన అంశాలు ప్రారంభంలో చోటు చేసుకొన్నాయి. ఈ శతకంలో దశావతారస్తోత్రం, జ్యోతిషశాస్త్ర అంశాలు, నవగ్రహస్తుతి, ఋతువర్ణన మొదలైన విషయాలు అన్నయ్య పాండిత్యానికి నిదర్శనాలు.

అలాగే భాగవతప్రసిద్ధమైన 'గంగావతరణ' ఘట్టం ఇందులో 'ప్రత్యేకాకర్షణ' అని చెప్పవచ్చు. ఈ సందర్భానికి సంబంధించిన పూర్వాపరాల్ని మరికొన్ని పద్యాలుగా చేర్చితే అదొక ఖండకావ్యమే అవుతుంది. పంచభూతాల్ని ప్రస్తుతించడంతోపాటు రాంభట్ల కుటుంబ మూలవిరాట్ కీ. శే. డా. రాంభట్ల వేంకటరావుగారు మొదలుగా పలువురు ఆత్మీయుల స్మరణం ఈ శతకానికి మరింత శోభను చేకూర్చింది.

ఈ విధంగా అన్నయ్య వేంకటరాయశర్మ పద్య కవితాభ్యాసానికి, ఆశుకవితావిన్యాసానికి ఆధారమైన ఈ శతక రచన ఇప్పటికే 'వాట్సాప్' సమూహాల్లో విశేషాదరణ పొందింది. ఇప్పుడిది పుస్తకరూపంలో సాహిత్యప్రియులకు అమందానందాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు. 'సుధీరకథనాల'తో కథకుడిగా రాణిస్తున్న అన్నయ్య - ఈ శతకంతో కవిగా అందరికీ మరింత చేరువయ్యాడు. ఇలాగే మరిన్ని ప్రక్రియల్లో అందెవేసిన వేయిగా అభివృద్ధిపథంలో సాగాలని ఆకాంక్షిస్తూ...

'శతావధాని' రాంభట్ల పార్వతీశ్వర శర్మ





రాంభట్ల వేంకటరాయ శర్మ

సీనియర్ రీసెర్చి ఫెలో (Ph.D.), తెలుగుశాఖ,
ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

జన్మస్థలం : శ్రీకాకుళం.

పుట్టినతేది : **17 - 08 - 1987.** (ప్రభవనామ శ్రావణ బహుళ అష్టమి)

జననీజనకులు : సూర్యకాంతకామేశ్వరి, కీ.శే. లక్ష్మీనరసింహసోమయాజులు

విద్యార్హతలు : ఎం.ఏ. తెలుగు., ఎం.ఏ. జ్యోతిషం, ఎం.ఎస్సి. మైక్రోబయాలజీ
యు.జి.సి. - జె.ఆర్.ఎఫ్. నెట్., ఎ.పి. - సెట్., (తెలుగు)
మెడికల్ లాబ్ టెక్నీషియన్.

అభిరుచులు : సాహిత్యం, జ్యోతిషం.

ముద్రితరచనలు : సుధీరకథనాలు (కథాసంకలనం) - **2016.**

అముద్రితరచనలు : సమస్య - దత్తపదుల పూరణ, ఎటెన్షన్ ప్లీజ్ (డిటెక్టివ్ నవల)
సంక్రాంతి, దండం దశగుణం భవేత్ (రేడియో నాటికలు)
జాతీయసదస్సుల్లో సమర్పించిన పరిశోధనాపత్రాలు,
సాహిత్య విమర్శనావ్యాసాలు, జ్యోతిశ్శాస్త్రవ్యాసాలు.

చిరునామా : ఫ్లాట్ నెం. **402,** సాయిబాలాజీ హోమ్స్,
సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం - **530051.**
సెల్ : **99852 43171.**

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

పుస్తకం సంఖ్య	DAKJ103B145
పుస్తకం పేరు	గురుస్తుతిశతకం
తారీఖు	26 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	39
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	No
తయారు చేసినది	Nandini
పేజీలు విడదీసినది	madhu
స్కాన్ చేసినది	CL Nage. [illegible]
పరీక్ష చేసినది	SARANYA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good